క్లుప్తంగా

నేడు మంత్రి కుప్పం రాక

• నామినేషన్ వేయనున్న భరత్

కుప్పం: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బుధవారం తాను నామినేషన్ వేయనున్నట్టు భరత్ తెలిపారు. ముఖ్యఅతిథిగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొంటారని, పార్టీ నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్టు చెప్పారు. ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కుప్పంలో 5 నామినేషన్లు




భరత్ నామినేషన్ సెట్‌ను ఇస్తున్న మున్సిపల్ చైర్మన్ సుధీర్, ప్రియ

కుప్పం: కుప్పం నియోజకవర్గంలో మంగళవారం 5 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి భరత్ తరపున మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ ఒకటి, ఆయన భార్య ప్రియ రెండు సెట్ల నామినేషన్లు వేశారు. అలాగే బీఎస్పీ తరపున గణేష్, ఇద్దరు ఇండిపెండెంట్లు నామినేషన్లను రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు అందజేశారు.

పలమనేరులో మూడు..

పలమనేరు: సాధారణ ఎన్నికలకు సంబంధించి మంగళవారం మూడు నామినేషన్లు దాఖలైనట్టు రిటర్నింగ్ అధికారి మనోజ్‌రెడ్డి తెలిపారు. ఇండిపెండెంట్‌గా అలసపుర సుబ్రమణ్యం, బహుజన్ సమాజ్ పార్టీ నుంచి శోభ, వైఎస్సార్ సీపీ నుంచి పావనీ గౌడ నామినేషన్లు వేశారు.

ప్రపంచానికి పుస్తకం ఓ దిక్సూచి



కల్లూరు హైస్కూల్లో నిర్వహించిన ప్రపంచ పుస్తక దినోత్సవం

పులిచెర్ల(కల్లూరు): మంచిపుస్తకం–ఓమంచి నేస్తం, ఇది ప్రపంచానికి ఓ దిక్సూచి లాంటిదని కల్లూరు హైస్కూల్ హెచ్‌ఎం శ్రీవాణి అన్నారు. మంగళవారం కల్లూరు హైస్కూల్లో ప్రపంచ పుస్తక దినోత్సవం నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ, విద్యార్థులకు మంచి పుస్తకాలు చదవాలని, పుస్తక పఠనం వలన విజ్ఞానం పెరుగుతుందన్నారు. అంతేకాకుండా చుట్టూ ఉన్న సమాజాన్ని, ప్రపంచం గురించి తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వెంకటసిద్దులు, రాజశేఖర్, వేణుగోపాల్, రాజేంద్ర, శివరాజు తదితరులు పాల్గొన్నారు.

పలమనేరులో..

పలమనేరు: మంచి పుస్తకం పదిమంది స్నేహితులతో సమానమని స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు అన్నారు. ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక కళామందిరంలో పుస్తకమే నిజమైన నేస్తం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పిల్లలకు కథల పుస్తకాలను పంపిణీ చేశారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ వెంకటేశులు అధ్యక్షతన ఇదే కార్యక్రమం నిర్వహించారు.

మాజీ సర్పంచ్ మృతి



ప్రకాశం రెడ్డి (ఫైల్)

సదుం: మండలంలోని 79–ఏ చింతమాకులపల్లె పంచాయతీ దిన్నెమీదపల్లెకు చెందిన మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు తమటం ప్రకాశం రెడ్డి (85) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఆయన మృతికి పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన అంత్యక్రియలు బుధవారం నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు చెప్పారు.

మల్లయ్యా! ఆశీర్వదించయ్యా..



ఉత్సవంలో సుబ్రమణ్యంరెడ్డి, సెంథిల్

గుడుపల్లె: సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్ సీపీ గెలుపొందేలా ఆశీర్వదించాలని జెడ్పీ మాజీ చైర్మన్ సుబ్రమణ్యంరెడ్డి, రెస్కో చైర్మన్ సెంథిల్ మల్లయ్యస్వామికి మొక్కారు. మంగళవారం సోడిగానిపాళ్యంలో జరుగుతున్న ఆవుల మల్లయ్య ఉత్సవాలకు వారు హాజరయ్యారు. అనంతరం మల్దేపల్లె, దిన్నేపల్లె, తిమ్మనాయనపల్లె, సోడిగానిపాళ్యంలో ఎన్నికల ప్రచారం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి భరత్, ఎంపీ అభ్యర్థి రెడ్డెప్పను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

ఘనంగా పౌర్ణమి వేడుకలు



వి.కోట: చిత్రా పౌర్ణమిని పురస్కరించుకుని మంగళవారం మండలంలోని అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక వీరాంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. సాయంత్రం తమలపాకుల హారంతో స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. వందలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

గత పాలకుల పాపాలే కుప్పానికి శాపాలు

• వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక నీటి సమస్యపై దృష్టి
• హంద్రీ–నీవా కాలువతో తాగు, సాగునీటి సమస్యలు పరిష్కారం
• ఉపాధి కల్పనకు పారిశ్రామికవేత్తలతో చర్చించా
• పరిశ్రమల స్థాపనకు అనుకూలత
• కుప్పం అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక
• ఆదరించి గెలిపిస్తే అండగా ఉంటా
• మర్చంట్ అసోసియేషన్ సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థి భరత్



మాట్లాడుతున్న భరత్

కుప్పం: గత పాలకుల పాపాలే కుప్పం ప్రగతికి శాపాలుగా మారాయని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ పేర్కొన్నారు. ప్రధానంగా గత పాలకులు నీటి సమస్యపై దృష్టి సారించకపోవడమే తాగు, సాగు నీటి సమస్యలే కాకుండా పరిశ్రమల స్థాపనకు ఇది అవరోధంగా మారిందని విశ్లేషించారు. సీఎం జగనన్న చొరవతో హంద్రీ–నీవా కాలువ పూర్తి చేశామని, ఇక కుప్పం అభివృద్ధి ముఖచిత్రం మారనుందని చెప్పారు. మంగళవారం కుప్పం మర్చంట్ అసోసియేషన్ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న తనను ఆదరించి గెలిపిస్తే అందరికీ అండగా ఉంటానని, కుప్పాన్ని మరింత అభివృద్ధి చేస్తానని భరత్ విజ్ఞప్తి చేశారు. కుప్పంలో వ్యాపార రంగం అభి వృద్ధికి, తద్వారా కుప్పం ప్రగతి పథంలో తీసుకెళ్లడానికి మర్చంట్ అసోసియేషన్ సలహాలు–సూచనలు స్వీకరించి, వాటికి కార్యరూపం ఇచ్చే దిశగా కృషి చేస్తానని ప్రకటించారు. నియోజకవర్గానికి ప్రధానంగా ఉపాధి అవకాశాలు కల్పించడానికి చెన్నై, బెంగళూరు, ముంబై, హైదరాబాద్ పట్టణంలో పారిశ్రామిక వేత్తలను ఇప్పటికే కలిసి చర్చించినట్టు చెప్పారు. ప్రధానంగా కుప్పం ప్రాంతంలో పరిశ్రమలకు భూములు ఇవ్వగలిగే పరిస్థితులు ఉన్నా నీటి సమస్య మూలాన పరిశ్రమల స్థాపనకు ముందుకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వర్షాభావం వెంటాడుతోందని, వర్షాలు సమృద్ధిగా కురిస్తే నీటి సమస్యల్ని అధిగమిస్తామన్నారు. అంతేకాకుండా ప్రజల నిండైన ఆశీస్సులు, దైవానుగ్రహంతో మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం తథ్యమని, అప్పుడు పాలారు ప్రాజెక్టు పను లు పూర్తి చేస్తామన్నారు. అలాగే వర్షాలు బాగా కురిస్తే అటు హంద్రీ–నీవా, ఇటు పాలారు ప్రాజెక్టుతో నీటి నిల్వ చేసుకోగలుగుతామన్నారు. దీనివల్ల నీటి కష్టాలు తొలగిపోతాయని, పారిశ్రామికవేత్తలు కుప్పం వైపు మొగ్గు చూపుతారనే నమ్మకం తనకుందన్నారు. కుప్పం అభివృద్ధిపై సమగ్ర ప్రణాళికతో సిద్ధంగా ఉన్నామని, వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శరవణ, మర్చంట్ అసోసియేషన్ నాయకులు మహేష్, శేఖర్, పలువురు వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

కిరణ్.. నోరు అదుపులో పెట్టుకో



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి

• మీ అమ్మ గెలుపు కోసం అప్పట్లో మంత్రి పెద్దిరెడ్డి ప్రచారం చేశారు
• ఆయన కుటుంబంపై ఆరోపణలు చేస్తే సహించం

చౌడేపల్లె: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి 5 లక్షల ఓట్ల మెజార్టీతో విజయం సాధిస్తారని, ఈ ఫలితాలతో జూన్ 4న సూట్‌కేస్ సిద్ధం చేసుకుని హైదరాబాద్‌కు వెళ్లడానికి మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి సిద్ధంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి సవాల్ విసిరారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మీడియాతో పెద్దిరెడ్డి మాట్లాడారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబంపై వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేది లేదని మండిపడ్డారు. సత్యసాయిబాబా ఆస్తులు, నగలు, నగదు కొల్లగొట్టారని, ఇది వెలుగులోకి రాకుండా ఉండేందుకే కిరణ్‌కుమార్‌రెడ్డి బీజేపీలో చేరారని ఆరోపించారు. రెడ్డెప్పరెడ్డి, చెంగారెడ్డి, సీకే బాబు,గోపీనాథ్, అరుణకుమారితో పాటు మరికొందరితో కలిసి కిరణ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్‌లో పెద్దిరెడ్డికి వ్యతిరేకంగా జత కట్టినా ప్రస్తుతం వారంతా రాజకీయ నిరుద్యోగులుగా నిలిచిపోయారని అపహాస్యం చేశారు. పెద్దిరెడ్డిని పీలేరు నుంచి దూరం చేయాలని కుట్రపన్ని, మండలాలను విభజించి, పుంగనూరుకు వచ్చేలా చేశారని, పుంగనూరులో ఆయనకు ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. ద్రోహం చేయాలని చూసిన కిరణ్ ఓటమిపాలయ్యారన్నారు. శివశక్తి డెయిరీ, మ్యాంగో జ్యూస్ ఫ్యాక్టరీ గురించి అవాకులు చెవాకులు పేలితే ఉపేక్షించేది లేదని, చంద్రబాబు హెరిటేజ్ కంటే అధిక ధరలిస్తున్నామన్నారు. రాజకీయంగా అండగా నిలిచిన రాజశేఖరరెడ్డి కుటుంబానికి మోసం చేసి, జగన్‌ను జైల్లో పెట్టించిన చరిత్రహీనుడు కిరణ్ అని దుయ్యబట్టారు. కిరణ్ తండ్రి అమరనాథరెడ్డి మృతి చెందితే కిరణ్ తల్లి నల్లారి సరోజమ్మ గెలుపుకోసం అప్పట్లో మంత్రి పెద్దిరెడ్డి ప్రచారం చేశారని, ఇవన్నీ విస్మరించి నల్లారి కిరణ్ బురద చల్లితే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు దామోదర రాజు, పార్టీ మండల కన్వీనర్ అంజిబాబు, మాజీ ఎంపీపీలు రెడ్డిప్రకాష్, రుక్మిణమ్మ, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, చిత్తూరు, రాజంపేట సెగ్మెంట్‌ల యూత్ అధ్యక్షుడు మిద్దింటి కిషోర్‌బాబు, ఆర్యవైశ్య వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు నాగరాజ, మంజునాథ్, సర్పంచులు వరుణ్ భరత్, రఘురామిరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, హరి, మురళి, రామ్మూర్తి పాల్గొన్నారు.

జోరుగా పావనీగౌడ ప్రచారం



ఎన్నికల ప్రచారంలో పావనీగౌడ, నాయకులు, కార్యకర్తలు

వి.కోట: తన భర్తను గెలిపించాలని కోరుతూ మంగళవారం మండలంలోని యాలకల్లు పంచాయతీలోని గ్రామాల్లో ఎమ్మెల్యే వెంకటేగౌడ సతీమణి పావనీ గౌడ జోరుగా ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వెంకటేగౌడను, ఎంపీ అభ్యర్థి రెడ్డెప్పను మరోసారి గెలిపించాలని అభ్యర్థించారు. తన భర్త చేసిన అభివృద్ధిని వివరించారు. గత ప్రభుత్వ పాలనలో ఏం చేశారు? ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలనలో ఎంతగా అభివృద్ధి చేశారో బేరీజు వేసుకుని వైఎస్సార్ సీపీ అభ్యర్థులను ఆదరించాలని కోరారు. ఆచరణకు సాధ్యం కాని టీడీపీ నేతల హామీలను నమ్మరాదన్నారు. జగనన్నను మరోసారి సీఎం చేసుకుంటే సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజ్ ,వైస్ ఎంపీపీ తమీమ్, పార్టీ నాయకులు నరేంద్ర, బాలాజి, పంచాయతీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మీ ఇంటాయనకే ఓటేస్తాలేమ్మా!

• ఎమ్మెల్యే సతీమణి పావనీగౌడకు చెప్పిన మహిళ



ఓటేయాలని అభ్యర్థిస్తున్న పావనీగౌడ

పలమనేరు: ''వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా మా ఆయన వెంకటేగౌడ మళ్లీ నిలిచినాడు.. ఫ్యాను గుర్తుకి ఓటేయాలక్కా!'' అని వెంకటేగౌడ సతీమణి పావనిగౌడ దారిలో తనకు నెత్తిన కసువు మోపుతో ఎదురైన మహిళకు కరపత్రం ఇచ్చి అభ్యర్థించింది. మీరు అడిగినా.. అడక్కపోయినా నేను మీ ఇంటాయన వెంకటేగౌనికే ఓటేస్తాలేమ్మా..అని ఆ మహిళ చిరునవ్వుతో బదులిచ్చింది. వీకోట మండలం యాలకల్లు పంచాయతీలో మంగళవారం ఎన్నికల ప్రచారంలో చోటుచేసుకున్న దృశ్యమిది. మీ గౌడు మా జగనన్న పక్క నిలబడినాడు.. మాఇంటికి జగనన్న వల్ల ఎంతో మేలు జరిగింది.. ఆయప్ప మాకు మేలు చేశాడు.. అందుకే నేను ఫ్యాను గుర్తుకే ఓటేస్తా అని చెప్పడంతో కార్యకర్తలు ఉత్సాహంతో ముందుకుసాగారు.

ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



ఆలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: మున్సిపాలిటీలోని నీళ్లకుంట, బొమ్మిదొడ్డి గ్రామస్తులు నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవంలో స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ మంగళవారం హాజరై అక్కడి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గ్రామస్తులు ఆయనకు సాదర స్వాగతం తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ క్యూడీఎస్ రాజేష్, సుబ్రమణ్యం రెడ్డి(మణి), వాసు, వెంకట్రామన్న తదితరులు పాల్గొన్నారు.

సాయినాథుని ఆలయంలో..

గంగవరం: పౌర్ణమి పురస్కరించుకుని మండలంలోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలో సాయినాథునికి ఉదయం నుంచి అర్చకులు విశేష పూజలు చేశారు. సాయినాథుని ఎమ్మెల్యే వెంకటేగౌడ దర్శించుకున్నారు. ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, గిరిరాజారెడ్డి, చలపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం



రామకుప్పం: రథంపై ఊరేగుతున్న పార్వతీ పరమేశ్వరులు

గుడుపల్లె: శ్రీ ప్రసన్న రాళ్లగంగమాంబ ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. రథాన్ని రంగు రంగుల వస్త్రాలు, పచ్చటి తోరణాలతో అలంకరించారు. మంగళవాయిద్యాల హోరు, వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య రథంపై అమ్మవారు కొలువు దీరారు. భక్తులు గోవింద నామస్మరణతో అలాగారు. అలయం చుట్టు రథోత్సవాన్ని భక్తులు లాగారు. భక్తులు విశేషంగా వచ్చి అమ్మవారిని దర్శనం చేసుకున్నారు.

రామకుప్పంలో..

రామకుప్పం: స్థానిక శ్రీ అన్నపూర్ణాంబ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి రథోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం సజ్జల చెంగారెడ్డి కుటుంబీకుల ఆధ్వర్యంలో రథోత్సవం ప్రారంభమైంది. పార్వతీ పరమేశ్వరులు రథాన్ని అధిష్టించి మాడవీధుల్లో విహరించారు. భక్తుల హర హర మహదేవ నామస్మరణతో మాడ వీధులు మార్మోగాయి.

27న పాలిటెక్నిక్ ఎంట్రన్స్

పలమనేరు: పలమనేరు రెవిన్యూ డివిజన్‌లో ఈనెల 27న పాలిటెక్నిక్ ఎంట్రన్స్ నిర్వహించనున్నట్టు ఆర్డీఓ మనోజ్‌రెడ్డి మంగవారం రాత్రి తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో పలమనేరు, కుప్పం కేంద్రాల కో–ఆర్డినేటర్లతో ఆయన సమీక్షించారు. 2044మంది వరకూ హాజరు కానున్నారని వీరికి పలమనేరులో 5, కుప్పంలో 2 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందన్నారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మహమూద్, గంగవరం , పలమనేరు పోలీసులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల ఊరేగింపు



పలమనేరు: నవమి ఉత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీరామ భజన మందిరంలో మంగళవారం సీతారాముల కళ్యాణం, ఆపై పట్టణంలో స్వామివార్ల ఊరేగింపు మేళతాళాల మధ్య మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు.

పది ఫలితాలలో 'భాష్యం' విజయకేతనం



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ సుబ్రమణ్యం

పుంగనూరు: పదవ తరగతి ఫలితాలలో పట్టణంలోని భాష్యం పాఠశాల విద్యార్థులు విజయఢంకా మోగించారు. ప్రిన్సిపల్ సుబ్రమణ్యం మంగళవారం మాట్లాడుతూ, తమ స్కూల్ విద్యార్థినులు దీపికశ్రీ 597, వర్షిత 593 మార్కులు సాధించారన్నారు. 20 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. విద్యార్థులను జెడ్‌ఈఓ లక్ష్మణరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

తండ్రీకొడుకుల గెలుపు కోసం ప్రచారం




పుంగనూరులో ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, పీఆర్‌ఆర్ వారియర్స్ డాక్టర్ల ప్రచారం

పుంగనూరు: ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యే అభ్యర్థి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ అభ్యర్థి మిథున్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా ఓటర్లను కోరారు. మంగళవారం ఆయన స్థానిక శాంతినగర్, రాగానిపల్లె రోడ్డు ప్రాంతాలలో ఇంటింటా ప్రచారం చేశారు. అలాగే కోనేటిపాళ్యం, హైస్కూల్‌వీధి ప్రాంతాలలో పీఆర్‌ఆర్ వారియర్స్ డాక్టర్లు ప్రభాకర్, శివ, శరణ్, సుధాకర్‌రెడ్డి, రాజారెడ్డి, త్రిమూర్తిరెడ్డి, ఆవుల హరిప్రసాద్, మధుసూదన్‌రెడ్డి, పిఎల్.శ్రీధర్, కృష్ణప్ప, శ్రీనివాసులు, నానబాలగణేష్, రెడ్డెప్ప, ఆర్‌కె.రామకృష్ణ, డాక్టర్ రమణరావు, బిటి.అతావుల్లా, రామచంద్ర కరపత్ర ప్రచారం ప్రచారం చేశారు. ప్రచారంలో ముల్లంగి విజయకుమార్, లక్ష్మణరాజు, రాజగోపాల్, అజీజ్, సయ్యద్, మురళి, భాస్కర్‌జెట్టి, తుంగ చంద్రశేఖర్, మునిరాజ, ఉమాదేవి, సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సదుంలో..



సదుం: ప్రచారం చేస్తున్న ఇందిరమ్మ

సదుం: స్థానిక లక్ష్మీ నగర్, కల్లూరు రోడ్డు, కాలేజీ రోడ్డు తదితర ప్రాంతాలతో పాటు తిమ్మానాయనపల్లె పంచాయతీలో మంగళవారం మాజీ ఎంపీపీ పెద్దిరెడ్డి ఇందిరమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, పెద్దిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి ఎన్నికల ప్రచారం చేశారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కరపత్రాలతో ఓటర్లను అభ్యర్థించారు. సర్పంచులు ఉషారాణి, మురళీరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు మంగమ్మ, ఆనంద, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి, బోయకొండ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, నాయకులు సయ్యద్‌బాషా, ఖాజాపీర్, షబ్బీర్, ఇమ్రాన్, మస్తాన్, కాలేషా, మల్‌రెడ్డి, చిన్న రమణ, రమేష్, రామాంజులు, శ్రీనివాసుల రెడ్డి, శివారెడ్డి, వినోద్, మనోహర్‌రెడ్డి, అమరారెడ్డి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు పంచాయతీలో..

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు పంచాయతీలో మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సీఎం జగనన్న పథకాలతో అర్హులందరికీ మేలు కలిగిందని, దీనిని దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కరపత్ర ప్రచారం చేశారు. సర్పంచ్ షుకూర్, ఎంపీటీసీ రెడ్డి అహమ్మద్, వైస్ సర్పంచ్ కిషోర్, మువ్వల నరసింహులు శెట్టి, షౌకత్‌అలీ, విజయకుమార్, వినోద్, షాజహాన్, నజీర్, అల్తాఫ్, షారుక్, ముబారక్, ఫయాజ్, అస్లామ్, మహేష్, మునీర్, మువ్వల శేఖర్, ఆమీన్, ఖాదర్, రూపేష్, నియంతుల్లా, మున్ని, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.




సదుం: తిమ్మానాయనపల్లె ప్రచారం చేస్తున్న సోమశేఖర్ రెడ్డి, పులిచెర్ల: కల్లూరులో ..

సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ జగనన్నే రావాలి

• మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి



బైరెడ్డిపల్లె: కడపనత్తంలో ప్రచారం చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పలమనేరు: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్న పాలనే రావాల్సిన అవసరం ఉందని, అందుకే ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా వెంకటేగౌడను, ఎంపీగా రెడ్డెప్పను మరోసారి గెలిపించాలని పలమనేరు మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి ఓటర్లను కోరారు. మున్సిపాలిటీలోని 12,18 వార్డుల్లో టీఎస్ అగ్రహారం, గడ్డూరు కాలనీల్లో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, పట్టణ మాజీ కన్వీనర్ మండీసుధాలతో కలసి మంగళవారం ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలతో ఓటర్లను అభ్యర్థించారు. అలాగే, కొత్తపేటలో ఆయా ప్రాంత వైఎస్సార్‌సీపీ నాయకులు, కౌన్సిలర్లు, గంటావూరులో పట్టణ కన్వీనర్ జాఫర్, గొబ్బిళ్లకోటూరులో రవి, రఘునాథ్, కొత్తపేట ముత్తాచారిపాళెంలో పెయింట్ రెడ్డి, బొమ్మిదొడ్డిలో రాజేష్, పాతపేటలో కమాల్, 25వ వార్డులో గంగమ్మగుడి చైర్మన్ నరేష్, హేమంత్, హరీష్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. నాయకులు రెడ్డెప్ప రెడ్డి, ప్రసాద్, క్రిష్ణారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దపంజాణి మండలంలో..

పెద్దపంజాణి: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎంపీపీ రెడ్డెప్ప పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కత్తార్లపల్లె, మాదనపల్లె, చింతలపల్లె, చీమనపల్లెలో ఆయన పార్టీ శ్రేణులతో కలసి ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటా కరపత్రాలు అందజేసి ఓటర్లను అభ్యర్థించారు. ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎంపీ రెడ్డెప్పలను మరోసారి గెలిపించాలని కోరారు. సర్పంచ్ రమేష్, క్రిష్ణప్ప, వెంకటరమణ, సురేంద్ర, రఘుపతి, మునిరాజు తదితరులు పాల్గొన్నారు.

కడపనత్తం, గౌనితిమ్మేపల్లెలో..

బైరెడ్డిపల్లె: మండలంలోని కడపనత్తం, గౌనితిమ్మేపల్లెలో మంగళవారం జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకులు బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, జెడ్పీటీసీ సభ్యుడు ఆర్.కేశవులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్.వెంకటేగౌడ, ఎంపీ అభ్యర్థి ఎస్.రెడ్డెప్పకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు కరపత్రాలు ఇచ్చి కోరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో చేసిన అభివృద్ధి, ప్రజలకు పార్టీలకతీతంగా అందిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి దయానందగౌడు, మాజీ ఎంపీపీ విమల, వైస్ ఎంపీపీలు రూప, నారాయణస్వామి, సర్పంచులు చంద్రిక, వెంకటేష్, రవిచంద్రబాబు, నారాయణమ్మ, బాలక్రిష్ణగౌడు, ఎంపీటీసీలు జగదీష, అమరావతి, నాగరాజు, వినాయకం, మండల కన్వీనర్ కార్తిక్, మండల యూత్ ప్రెసిడెంట్ మహేష, వైఎస్సార్‌సీపీ నేతలు తబ్రాజ్‌బాషా, ఫైజుల్లా, శ్రీనివాసులురెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కుప్పస్వామి, లక్ష్మీనారాయణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



టీఎస్ అగ్రహారంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, నాయకులు



పెద్దపంజాణి: కరపత్ర ప్రచారం చేస్తున్న ఎంపీపీ రెడ్డెప్ప తదితరులు



బైరెడ్డిపల్లె: గౌనితిమ్మేపల్లెలో ఎన్నికల ప్రచారం చేస్తున్న బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి

కనుల పండువగా కళ్యాణోత్సవం



ప్రత్యేకపూజలందుకున్న సీతారామలక్ష్మణులు

చౌడేపల్లె: స్థానిక బజారువీధిలో రామమందిరంలోని సీతారాముల ఉత్సవమూర్తులకు మంగళవారం కనుల పండువగా కళ్యాణోత్సవం నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణ, భక్తజన సందోహం నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు అభిషేకాల అనంతరం శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కళ్యాణోత్సవానికి ఉభయదారులుగా బొగ్గరపు సుబ్రమణ్యంశెట్టి, ఉషారాణి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. అలాగే గడ్డంవారిపల్లె రామాలయంలో వేదపండితులు ఆనందాచార్యుల ఆధ్వర్యంలో కళ్యాణోత్సవం అనంతరం అన్నదానం చేశారు.



గడ్డంవారిపల్లెలో కళ్యాణోత్సవం అనంతరం పూజలు చేస్తున్న గ్రామస్తులు